టార్గెట్ వందశాతం ఉత్తీర్ణత

- ప్రభుత్వ పాఠశాలల్లో 'పది' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రణాళిక
- అన్ని సబ్జెక్టుల్లో పట్టు సాధించేలా ఉపాధ్యాయుల కృషి
- ఈనెల 21వ తేదీ నుంచి పరీక్షలు


ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థినులు

ఎల్కతుర్తి : ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధన అందిస్తూ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పక్కా ప్రణాళిక రూపొందించి ముందుకెళ్తున్నారు. గత సంవత్సరం డిసెంబర్ 11 నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల దృష్టిని చదువుపై మళ్లిస్తున్నారు. అయితే ఈ ఏడాది జనవరి 02 నుంచి ఉదయం గంట, సాయంత్రం గంట, రెండుపూటల స్టడీ అవర్స్ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం 8:30 నుంచి 9.30 వరకు, సాయంత్రం 4.30 నుంచి 5.45 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండగా.. రెసిడెన్షియల్ స్కూళ్లలో ఉదయం 7.30 గంటల నుంచి 8.30 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 6గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్ తెలిపారు.

అన్ని సబ్జెక్టుల్లో పట్టు సాధించేలా..

మండలంలో మొత్తం 20 గ్రామ పంచాయతీలకు గాను మరో 2 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. వీటి గాను 14 జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో 317 మంది పదో తరగతి విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కాగా వీరంతా రానున్న వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. అన్ని సబ్జెక్టుల్లో పట్టు సాధించేలా విద్యార్థులను తీర్చి దిద్దుతున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. విద్యార్థులకు బోధించిన పాఠాలపై రోజు వారిగా స్లిప్ టెస్టులు నిర్వహిస్తూ సందేహాలను నివృత్తి చేస్తున్నారు. అలాగే స్థానిక కేజీబీవీలో మొత్తం 45మంది విద్యార్థినులు పదో తరగతి చదువుతున్నారు. వార్షిక పరీక్ష ఫలితాల్లో విద్యార్థినులు మంచి మార్కులు సాధించమే కాకుండా వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఆ పాఠశాల ఉపాధ్యాయినులు ఈ సందర్భంగా తెలిపారు.

మంచి మార్కులు సాధిస్తాం



పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి మార్కులు సాధిస్తాను. మా పాఠశాలలో టీచర్లు ప్రత్యేక తరగతులు నిర్వహించి చదువుపై ప్రోత్సహిస్తున్నారు. ప్రతీ సబ్జెక్టుపై పట్టు సాధించేలా రోజువారి స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నారు. సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఉపాధ్యాయుల నమ్మకాన్ని నిలబెడుతాం.

- ఎం.అలేఖ్య, 10వ తరగతి

సులువుగా అర్థమవుతున్నాయి



రెగ్యులర్ క్లాస్‌లతో పాటు స్టడీ అవర్స్ నిర్వహించడం వలన పాఠాలు సులువుగా అర్థమవుతున్నాయి. చెప్పిన సబ్జెక్ట్‌కు స్లిప్ టెస్టు నిర్వహించడంతో ఎంతో ప్రయోజనం ఉంది. పరీక్షలంటే భయం కూడా తొలగిపోయి ఆందోళన చెందకుండా పరీక్షలు రాయొచ్చు. క్రమం తప్పకుండా ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నాం.

- బి.ప్రవళిక, 10వ తరగతి

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



మా పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి చదువుపై ప్రోత్సహిస్తున్నాం. స్టడీ అవర్స్‌లో సందేహాలను నివృత్తి చేసి ఉదయం స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులను తీర్చి దిద్దుతున్నాం.

- అనితాదేవి, కేజీబీవీ ప్రిన్సిపాల్, ఎల్కతుర్తి

క్లుప్తంగా

బీజేపీ శ్రేణుల సంబురాలు



కమలాపూర్ : మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బీజేపీ బలపరిచిన అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపొందడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ శ్రేణుల సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా స్థానిక విశ్వభారతి హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు తిలకం దిద్ది మిఠాయిలు పంచిపెట్టారు. బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు కట్కూరి అశోక్‌రెడ్డి, నాయకులు తుమ్మ శోభన్‌బాబు, నాసని రాజు, ఎడ్ల రాజేందర్, ఆడెపు వినయ్ పాల్గొన్నారు.

రేపు రైల్వే పాలిక్లినిక్‌లో క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

కాజీపేట రూరల్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కాజీపేట రైల్వే పాలిక్లినిక్‌లో ఈనెల 6వ తేదీన కాజీపేట రైల్వే రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కాజీపేట రైల్వే రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.సంగమయ్య తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ హెప్జిబాకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: హనుమకొండలోని ప్రభుత్వ మహిళా పింగిళి కళాశాల ఇంగ్లిష్ అసిస్టెంట్ ప్రొఫెసర్ హెప్జిబాకు కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. దళిత్ ఫెమినిజం భామా, శివకామి రచనల అధ్యయనం అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి హెప్జిబాకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. కేయూ ఇంగ్లిష్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో హెప్జిబా తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక



కాళోజీ సెంటర్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)స్కాలర్‌షిప్‌నకు తమ పాఠశాలలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం కె.అరుణ తెలిపారు. వారికి ప్రతి సంవత్సరం రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందజేయనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

ఖిలా వరంగల్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య విమర్శించారు. వరంగల్ ఉర్సుగుట్ట సమీపంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యురాలు నలిగంటి రత్నమాల అధ్యక్షతన సీపీఎం విస్తృత స్థాయి సమావేశం మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా నాగయ్య హాజరై మాట్లాడుతూ బడ్జెట్‌లో రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక వర్గాలకు నిధులు కేటాయింపుల్లో కేంద్రం మొండిచేయి చూపిందని ఆరోపించారు. సన్నధాన్యానికి క్వింటాకు రూ.500 చొప్పున బోనస్‌ను పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదని అన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రంగయ్య, జిల్లా కమిటీ ప్రతినిధులు ఈసంపెల్లి బాబు, సింగారపు బాబు, కుమారస్వామి, అరూరి కుమార్, నమిండ్ల స్వామి, శ్రీధర్, సాంబయ్య, బషీర్, దుర్గయ్య, ప్రశాంత్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలందించాలి

హన్మకొండ: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించాలని ఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్ఈ పి.మధుసూదన్ రావు సూచించారు. హనుమకొండ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన మధుసూదన్ రావును తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నె శశికుమార్, ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు రావుల రమణారెడ్డి, నాయకులు మంగళవారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఏఓ నవీన్ కుమార్, తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కె.మహేష్, సంగీత్ కుమార్, ఎం.వేణు, కె.యుగేందర్, జి.ఉపేందర్, పి.ధనలక్ష్మి, బి.వనిత, జె.స్వప్న, చరణ్ కుమార్, రామకృష్ణ, రాజయ్య, దామోదర్, చారి, నవీన్ కుమార్, సాయికృష్ణ పాల్గొన్నారు.

ఎల్లమ్మ అనుగ్రహం ప్రజలపై ఉండాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి


ఎల్లమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

వేలేరు : ఎల్లమ్మ అనుగ్రహం ప్రజలపై ఉండాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని మల్లికుదుర్ల గ్రామంలో రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు గౌడ సంఘం ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా జరుగుతున్నాయి. మంగళవారం స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ పాడి పంటలతో సంతోషంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు యాదగిరి, వెంకటేశ్వర్లు, గౌడ సంఘం అధ్యక్షుడు సుధాకర్, ఉపాధ్యక్షుడు ప్రభాకర్, గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న సీఐ సంతోశ్

ఆత్మకూరు : మహిళలు, బాలికలు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని సీఐ సంతోశ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసను నివారించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఐ హాజరై మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం మహిళలు, పురుషులకు అన్ని రంగాల్లో సమాన హక్కులు కల్పించినప్పటికీ కొన్నిచోట్ల మహిళలు వివక్షకు గురవుతున్నారని తెలిపారు. అందరూ కలసికట్టుగా ఈ వివక్ష నుంచి మహిళలను కాపాడాలన్నారు. గృహహింస, మహిళా రక్షణ చట్టం, పోక్సో తదితర చట్టాల గురించి ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం సర్వోదయ ప్రాజెక్టు మేనేజర్ కవిరాజ్ మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసను రూపుమాపేందుకు సర్వోదయ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళా సహాయ కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కమిటీ సహాయాన్ని బాధిత మహిళలు వినియోగించుకోవాలని అన్నారు. ఆపద సమయంలో సఖి కేంద్రాన్ని సంప్రదించాలని అన్నారు. డాక్టర్ చైతన్య, ఎస్సై శ్రావణ్ కుమార్, ఐకేపీ ఏపీఎం లలిత, స్కూల్ అసిస్టెంట్ డాక్టర్ గణపతి, రవీందర్, సంపత్, రాజ్యలక్ష్మి, రవీందర్, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘాల లీడర్లు, పాల్గొన్నారు.

ఈజీఎస్ పనులు పూర్తిచేయాలి

- అదనపు డీఆర్డీఓ శ్రీనివాసరావు


ఆత్మకూరు : మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఆత్మకూరు : గ్రామాల్లో ఈజీఎస్ టార్గెట్ పనులను సత్వరమే పూర్తిచేయాలని అదనపు డీఆర్డీఓ శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని గ్రామ పంచాయతీల్లో పనులు జరిగేలా చూడాలని, ప్రతీరోజు ప్రతి గ్రామపంచాయతీలో 40 మందికి తక్కువ కాకుండా కూలీకి వచ్చేలా చూడాలని అన్నారు. మార్చి 2025 వరకు ఉన్న టార్గెట్ పనులు, మెటీరియల్, లేబర్ సంబంధించిన బడ్జెట్ మొత్తం వినియోగించేలా పనులు చేయాలని సూచించారు. గ్రామాల వారీగా మూడు సంవత్సరాల్లో ఏర్పాటు చేసిన ప్లాంటేషన్స్‌కి ప్రతివారం క్రమం తప్పకుండా నీళ్లు పట్టించాలని, వంద శాతం మొక్కలను కాపాడేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే నర్సరీలను కూడా ప్రతిరోజు సందర్శించి వంద శాతం జర్మినేషన్ ఉండేలా చూడాలన్నారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ విమల, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ రాజిరెడ్డి, ఈసీలు శ్రీధర్, రాము, టీఏలు సుధాకర్, శ్రీధర్, సురేశ్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దామెర : పాల్ట్రీ కంపోస్ట్ బిట్లు, అన్ని పనులు ఈనెల 20వ తేదీలోగా పూర్తిచేయాలని అదనపు డీఆర్డీఓ శ్రీనివాసారావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు, ఈజీఎస్ సిబ్బందితో మంగళవారం సమావేశమై మాట్లాడారు. ప్రతి గ్రామంలో 50 నుంచి 100 మంది కూలీలు తగ్గకుండా పని కల్పించాలన్నారు. ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, డీటీసీ శ్రీధర్, ఎంపీడీఓ విమల, ఎంపీఓ రంగాచారి, ఏపీఓ శారద, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మెరుగైన విద్యనందించడమే ధ్యేయం

- ఎంఈఓ రాంధన్


మాట్లాడుతున్న ఎంఈఓ రాంధన్

ధర్మసాగర్ : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ధ్యేయమని ఎంఈఓ రాంధన్ అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఇన్‌చార్జ్ హెచ్ఎం ధర్మప్రకాశ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా హాజరై పాఠశాల దృశ్యమాలిక ది క్రియేటివ్ నేక్సస్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. పాఠశాలలో నిర్వహిస్తున్న సృజనాత్మక కార్యక్రమాలు విద్యార్థుల నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఉపయోగపడుతాయని అన్నారు. సంఖ్యతో సబంధం లేకుండా ఉపాధ్యాయులు మెరుగైన విద్య అందించాలని, అదే ఉపాధ్యాయుల కర్తవ్యం అన్నారు. అనంతరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం మురళి మాట్లాడుతూ.. విద్యార్థులల్లో ఉన్న టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు ఉమా, భాగ్యలక్ష్మి విద్యార్థులకు నిర్వహించిన వివిధ క్రీడా పోటీలు, సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవిత, సురేశ్, పద్మజ, రాజమ్మ, కిరణ్మయి, ప్రసన్నతో పాటు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ చెక్కుల అందజేత



వరంగల్: వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారం చేస్తున్న అడ్తిసభ్యులు ప్రొఫెషనల్ ట్యాక్స్‌కు సంబంధించిన రూ.11,15,000 విలువైన 223 చెక్కులను వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా జీఎస్టీ అధికారులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో చాంబర్ ప్రధాన కార్యదర్శి మడూరి వేదప్రకాష్, కోశాధికారి అల్లె సంపత్, అడ్తి సెక్షన్ అధ్యక్షుడు ఎస్‌రెడ్డి లింగారెడ్డి, సలహాదారు వెల్ది చక్రధర్ పాల్గొన్నారు.

ఘనంగా విద్యుత్ లైన్‌మెన్ల దినోత్సవం


మహేందర్‌ను సన్మానిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది

కమలాపూర్ : మండల కేంద్రంలోని విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో మంగళవారం విద్యుత్ లైన్‌మెన్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లైన్‌మెన్ ఎ.మహేందర్, అసిస్టెంట్ లైన్‌మెన్ బి.ప్రేమ్‌కుమార్ సేవలను గుర్తించి హనుమకొండ రూరల్ డీఈ సామ్యనాయక్, కమలాపూర్ ఏడీఈ వంశీకృష్ణ శాలువాతో సత్కరించి అభినందించారు. వృత్తిపై శ్రద్ధ చూపి మరిన్ని ప్రశంసలు పొందాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాములు, సబ్ ఇంజనీర్ సతీశ్, విద్యుత్ శాఖ సిబ్బంది షాబుద్దీన్, రాజు, నరేశ్, సాగర్, సంతోశ్, వెంకటేశ్, రాంబాబు, రాము, కుమారస్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల నిధులతో కాన్ఫరెన్స్ హాల్

- 9న కేయూలో ప్రారంభోత్సవం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్ విభాగం పూర్వ విద్యార్థులు అందించి విరాళాలతో కాన్ఫరెన్స్ హాల్‌గా ఓ గదిని రూపొందించారు. ఈ నెల 9వ తేదీన దాన్ని ప్రారంభించనున్నట్లు విభాగం అధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ తెలిపారు. ఈ మేరకు వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రంతో కలిసి సంబంధిత కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు గడ్డం కృష్ణ, వడ్లకొండ సత్యనారాయణ, నాగరాజు, పరిశోధకులు కల్లెపెల్లి ప్రశాంత్, అంకెళ్ల శంకర్, కేతపాక ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

కమలాపూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ మోడల్ కళాశాలలో నేటి నుంచి 20వ తేదీ వరకు జరుగనున్న ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు అధికారులు తెలిపారు. రెండు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 544 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు సరోజన, డాక్టర్ జి.అనిత, డిపార్ట్‌మెంటల్ అధికారులు స్వజని, మాధవి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే పరీక్షలకు విద్యార్థులు సమయం కంటే ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని పరీక్షల సీఎస్‌లు, డీఓలు సూచించారు.

ఎల్కతుర్తి : ఎల్కతుర్తి మండలం ఇందిరానగర్ గ్రామ సమీపంలో గల మోడల్ స్కూల్, భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని మోడల్ స్కూల్, ఏకేవీఆర్ కళాశాలల్లో ఇంటర్మీడియేట్ పరీక్షలకు ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్ మంగళవారం అన్ని ఏర్పాట్లు చేశారు. ఎండలు ప్రతాపం చూపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు తాగునీటి సౌకర్యంతో పాటు కూర్చునేందుకు టెబుల్ బేంచీలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల్లో సెల్‌ఫోన్స్, స్మార్ట్ వాచీలకు అనుమతి లేదని తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని సూచించారు. కాగా ఈ మూడు సెంటర్లలో సుమారు 600 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు ఆయా కళాశాల ప్రిన్సిపాల్స్ తెలిపారు.

'తల్లిదండ్రులు చెప్పినట్లు నడుచుకోవాలి'

వరంగల్: విద్యార్థులు తమ తల్లిదండ్రులు చెప్పినట్లుగా నడుచుకోవాలని ఏనుమాముల పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ సూచించారు. ఆరెపల్లి సమీపంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల కళాశాల, పాఠశాలలో జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో బుధవారం ప్రదర్శనలు ఇచ్చి చదువు ప్రాముఖ్యత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లతో పాటు రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, షీటీమ్స్, హ్యూమన్ ట్రాఫికింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ మోసానికి గురైనట్లు గ్రహిస్తే వెంటనే హెల్ప్ లైన్ నంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై రాజు, కళాశాల ప్రిన్సిపాల్ కె.సుదర్శన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఇందిర, అధ్యాపకులు, ఉమెన్ ఏఎస్సై నాగమణి పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'అకుట్' ఎన్నికలు


ఓటుహక్కును వినియోగించుకుంటున్న రిజిస్ట్రార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (అకుట్) ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కేయూ పరిపాలన భవనంలోని సెనెట్ హాల్‌లో మంగళవారం పోలింగ్ నిర్వహించారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా 77మంది అధ్యాపకులకు గాను 75మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సీహెచ్.ప్రణయ్‌కుమార్ తెలిపారు. ఈనెల 5న ఓట్ల లెక్కింపు, అనంతరం ఫలితాలను వెల్లడించనున్నట్లు వివరించారు. అకుట్ అధ్యక్ష పదవికి ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ వెంకట్రాంరెడ్డి, జియాలజీ విభాగం ప్రొఫెసర్ మల్లికార్జున్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ పదవికి బయో టెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీనివాస్, మ్యాథమెటిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్ పీ.రాజ్‌కుమార్ పోటీ చేశారు. కాగా, అకుట్ ఉపాధ్యక్షురాలుగా ప్రొఫెసర్ సవితాజ్యోత్స్న, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ రాము, కోశాధికారిగా రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చెరువు కట్టపై ముళ్లపొదల తొలగింపు

చెన్నారావుపేట : మండలంలోని కాల్‌నాయక్ తండా శివారులోని తొర్రగుట్ట చెరువు కట్టపై ముళ్లపొదల తొలగింపు పనులను మంగళవారం లోడీ సాంఘిక సేవా స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్లు కిరణ్‌రెడ్డి, వీరబాబు మంగళవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. రైతుల సంక్షేమమే సంస్థ లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు వీరన్ననాయక్, లోడీ సంస్థ మండల కోఆర్డినేటర్ జనగాం రమేశ్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో లోపాలను సరిచేయాలి

- ఎమ్మార్పీఎస్ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యుడు దయాకర్


దప్పు కొడుతున్న నాయకులు

వేలేరు : ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ రిపోర్ట్‌లో ఉన్న లోపాలను సరిచేసి ఎస్సీల్లోని అన్ని కులాలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ ఫలాలు అందేలా చూడాలని ఎమ్మార్పీఎస్ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యుడు బొడ్డు దయాకర్ మాదిగ, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సుకుమార్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం వేలేరు అమర వీరుల స్థూపం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు డప్పుల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాదిగలకు న్యాయంగా 11 శాతం రిజర్వేషన్ రావాల్సి ఉండగా కేవలం 9 శాతం మాత్రమే వచ్చిందని ఆరోపించారు. వెంటనే సవరించి మాదిగ జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. త్వరలో చేపట్టబోయే మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్, జగన్, మండల అధ్యక్షుడు మనోజ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు కుమార్, రాజయ్య, యేసు, భాస్కర్, ప్రకాశ్, కొమురయ్య పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం


స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

దామెర : మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ రాజేశ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. చదువు ప్రాముఖ్యతను వివరించి ఒకరోజు ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించిన విద్యార్థులను అభినందించారు. జెడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు విజేందర్‌రెడ్డి, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు భగవాన్‌రెడ్డి ఉన్నారు.

బీఆర్ఎస్ హయాంలో మైనార్టీలకు పెద్దపీట



నయీంనగర్: బీఆర్ఎస్ హయాంలో మైనార్టీల కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి మైనార్టీలకు కేసీఆర్ పెద్దపీట వేశారని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా 6వ డివిజన్ సిటిజన్ ఫంక్షన్ హాల్‌లో ముస్లిం మహిళలకు బీఆర్ఎస్ నాయకుడు అబ్బు ఆధ్వర్యంలో నిత్యావసర సరకులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణలో సర్వమత సౌభ్రాతృత్వం విలసిల్లుతోందని, మత సామరస్యానికి, పరమత సహనానికి తెలంగాణ నెలవని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నల్లా స్వరూపరాణి, మైనార్టీ నాయకులు ఖుద్దూస్, ఎండీ.బ్రూహాన్, ఫెరోజ్, తదితరులు పాల్గొన్నారు.